బొగ్గు గనుల వేలం పాటను రద్దు చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను రద్దు చేసి, సింగరేణికి బొగ్గు బ్లాకులను కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.సత్యం డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్యకర్తలు, ప్రజలు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణకు తలమానికంగా ఉన్న సింగరేణి కాలరీస్ మూతపడే వైపు నెట్టి ప్రైవేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చే పని కేంద్ర ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 61 బొగ్గు బావులను వేలం వేస్తోందని, అందులో తెలంగాణ రాష్ట్రంలోని మంచిర్యాల జిల్లాలోని శ్రావణ పల్లి బొగ్గు బ్లాకు ఉందని ఆయన పేర్కొన్నారు. మూడు వేల కోట్ల రూపాయల లాభాలతో నడుస్తున్న సింగరేణిని దెబ్బతీసి ప్రైవేటు సంస్థలకు బొగ్గు నిలువలను అంటగట్టే ప్రయత్నం బీజేపీ ప్రభుత్వం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి సీపీఎం జిల్లా నేతలు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కోమటి రవి, అ.అశోక్, వినోద, రాథోడ్ సంతోష్, జి. శ్రీనివాసులు, జె.రాజశేఖర్, నరేష్, శంకర్, శ్రీనివాస్, గణేష్, సఫియా, శారద, చంద్రశేఖర్, కృష్ణ నాయక్, లింగస్వామి, ఉన్నికృష్ణ, కిష్టప్ప, శ్రీమన్నారాయణ, ఎస్.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

పాలకులు బాధ్యతగా పని చేయాలి

- రాజకీయాలకతీతంగా సమస్యల పరిష్కారానికి కృషి
- ఎంపీ ఈటల రాజేందర్


మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

పోచారం: ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు పాలకులు బాధ్యతగా పని చేయాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పోచారం పురపాలక సంఘం సమావేశ మందిరంలో చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. స్థానిక సంస్థల అభివృద్ధి కోసం పాలకులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా వద్ద అండర్ పాస్ ఏర్పాటు చేయాలని సభ్యులు వినతిపత్రం అందజేశారు. అనంతరం చైర్మన్ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ. 1.93 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఏకగ్రీవంగా సమావేశం ఆమోదం తెలిపిందన్నారు. రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, పారిశుద్ధ్య కార్మికులకు సామగ్రి నిమిత్తం నిధులను ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వేమనారెడ్డి, కౌన్సిలర్లు గొంగళ్ల మహేష్, నర్రి ధనలక్ష్మి, ఆకిటి శైలజ, చింతల రాజశేఖర్, మెట్టు బాల్‌రెడ్డి, బెజ్జంకి హరిప్రసాద రావు, బాలగోని వెంకటేశ్ గౌడ్, సామల శ్రీలత, నల్లవెల్లి లక్ష్మి, మమతా జగన్మోహన్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు శకుంతల, అక్రం అలీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


మొక్క నాటుతున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్‌కి బాత్‌లో ఇచ్చిన పిలుపు మేరకు ఏక్‌పేడ్ మాకే నామ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధి 11వ వార్డులోని రేణుకా ఎల్లమ్మ కాలనీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నేతలు రవీందర్‌రెడ్డి, కిషోర్‌గౌడ్, కృష్ణ, రాకేష్ గౌడ్, సతీష్‌కుమార్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

కీసర: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ గ్యామ అన్నారు. శుక్రవారం వన మహోత్సవంలో భాగంగా యద్గార్‌పల్లి గ్రామంలో మొక్కలు నాటారు. ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సూచించారు.


యాద్గార్‌పల్లి గ్రామంలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ గ్యామ తదితరులు

కార్మికులు పెద్ద ఎత్తున భాగస్వాములవ్వాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆశావర్కర్లు

కీసర: 10న కార్మికుల కోర్కెల దినం సందర్భంగా నిర్వహించే ధర్నాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా సెక్రటరీ రేవతి కల్యాణి అన్నారు. శుక్రవారం కీసర పీహెచ్‌సీ వద్ద నిర్వహించిన ఆశావర్కర్ల యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక సంస్కరణలు, ప్రైవేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు కేంద్రం చర్యలు చేపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 4 లేబర్ కోడ్లను అమలు చేస్తామని బీజేపీ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈపీఎఫ్ సకాలంలో చెల్లించని యాజమాన్యాలకు విధించే జరిమానాను భారీగా తగ్గించిందని, కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధంగా కేంద్రం చర్యలు తీసుకుంటుందన్నారు. నిరసనల్లో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె. ఉన్నికృష్ణన్, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జయప్రద, జిల్లా నాయకురాలు రాధ, రాణి, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలను ఉధృతం చేయాలి

జవహర్‌నగర్: కార్మిక పోరాటాలను మరింత ఉధృతం చేయాలని తెలంగాణ ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి రేవతి కల్యాణి అన్నారు. శుక్రవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమావేశం నిర్వహించారు. దేశ వ్యాప్తంగా జూలై 10న కార్మికుల కోర్కెల దినం పాటించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జూలై 10న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగే ధర్నాల్లో కార్మిక వర్గమంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.ఉన్నికృష్ణన్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జయప్రద, జిల్లా నాయకురాళ్లు రాధ, రాణి, శిల్ప పాల్గొన్నారు.

మేడ్చల్‌ను గ్రేటర్‌లో కలపొద్దు

మేడ్చల్: మేడ్చల్‌ను గ్రేటర్ హైదరాబాద్ నగర పాలక సంస్థలో విలీనం చేసి ప్రజలకు పాలనను దూరం చేయవద్దని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేందాస్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ ప్రాంతాన్ని గ్రేటర్‌లో విలీనం చేస్తే ప్రజలు ఏ చిన్న పని కోసమైనా తీవ్ర ఇబ్బందులు తప్పవన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. మేడ్చల్ ఇంకా గ్రామీణ వాతావరణంలో ఉన్నందున మున్సిపల్ స్థాయితోనే సరిపెట్టాలని ఆయన కోరారు.

నాయకుల ముందస్తు అరెస్ట్



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బీజేవైఎం అధ్యక్షుడు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అనిల్‌గౌడ్‌ను ఘట్‌కేసర్ పోలీసులు శుక్రవారం వేకువజామున ముందస్తు అరెస్ట్ చేశారు. తెలంగాణలో నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిర్వహించ తలపెట్టిన ముట్టడిని అడ్డుకోవడానికి పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ప్రత్యేక పాలన షురూ..

జడ్పీ స్పెషల్ ఆఫీసర్‌గా కలెక్టర్ గౌతమ్

- మండల పరిషత్‌లకు ప్రత్యేక అధికారుల నియామకం
- అధికారుల చేతుల్లోకి స్థానిక సంస్థల అధికారాలు
- నిధుల లేమితో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రభావం




జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ గౌతమ్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అభినందనలు తెలుపుతున్న జడ్పీ సీఈఓ దిలీప్, డిప్యూటీ సీఈఓ నీరజ

పెండింగ్ పనులపై ప్రభావం

జడ్పీ ప్రత్యేక గ్రాంట్, స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్. సాధారణ నిధులతో పలు గ్రామాల్లో చేపట్టాల్సిన సీసీ రోడ్లు, అంగన్‌వాడీల్లో మౌలిక వసతులు, బడుల్లో చిన్నపాటి నిర్మాణాలు, మురుగు కాల్వల నిర్మాణపు పనులు చాలాచోట్ల ఇంకా కొనసాగాల్సి ఉంది.

సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్.. ఇలా స్థానిక సంస్థల్లో కీలకమైన పరిపాలన పగ్గాలు ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లాయి. గురువారంతో మండల, జిల్లా పరిషత్‌ల పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ ప్రారంభమైంది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీ కాలం పూర్తవడంతో మరుసటి రోజు నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారులుగా తహసీల్దార్లు, ఎంపీడీవోలు సహా ఇతర గెజిటెడ్ హోదా కలిగిన వారిని నియమించారు. జిల్లా ప్రజా పరిషత్(జడ్పీ)స్పెషల్ అధికారిగా కలెక్టర్ గౌతమ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులకు మండల పరిషత్ అధ్యక్షుడి స్థానంలో ప్రత్యేకాధికారి బాధ్యతలు అప్పగించారు. మేడ్చల్ మండలానికి ప్రత్యేకాధికారిగా జిల్లా ప్రజాపరిషత్ సీఈఓ ఎస్ .దిలీప్‌కుమార్ నియమించగా, మూడుచింతల మండలానికి బి.నీరజాకు బాధ్యతలు అప్పగించారు. శామీర్‌పేట మండలానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో భూసేకరణ(పరిశ్రమలు)అధికారి సైదులును, ఘట్కేసర్ మండలానికి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి సాంబశివ రావు, కీసర మండలానికి జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమాను నియమించారు. వీరంతా శుక్రవారం ఆయా మండలాల్లో ప్రత్యేక అధికారులుగా బాధ్యతలు తీసుకున్నారు.

నిధుల లేమితో అభివృద్ధికి ఆటంకం..

ఒకప్పుడు జడ్పీల్లో నిధులు దండిగా ఉండేవి. 2017లో జిల్లాల విభజన అనంతరం 2018 నుంచి కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పడ్డాయి. అప్పటి వరకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కేంద్రంగానే వ్యవస్థ కొనసాగింది. 2014కు ముందు భారీగా నిధులు రాగా.. 2014–15 తరువాత నిధులు, విధుల పరంగా అవరోధాలు ఎదురవుతూ వచ్చాయి. 2014–15 ఆర్థిక సంవత్సరంలో 13వ ఆర్థిక సంఘం, బీఆర్జీఎఫ్ , ఇతర మార్గాల ద్వారా మాత్రమే సమకూరాయి. 2015– 16 ఆర్థిక సంవత్సరంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అందించే బీఆర్జీఎఫ్ నిధులు, ఆర్థిక సంఘం నిధులు రద్దయ్యాయి. దీంతో ఒక్క ఏడాది వ్యవధిలోనే 80 శాతం నిధులకు కోత పడింది. ఇక అప్పటి నుంచి కేవలం జిల్లాలో రిజిస్ట్రేషన్, అద్దెలు, సీనరేజీ, తలసరి ఆదాయం వంటి నిధుల వరకే అందాయి. ఉమ్మడి జిల్లా నుంచి జిల్లా పరిషత్తులు వేర్వేరుగా పరిపాలన పరంగా మంచి మార్పును చూపించినప్పటికీ, నిధులు, విధుల పరంగా సభ్యులు చాలా అవస్థలు ఎదుర్కొన్నారు. దీంతో నిరసనలు, ఆందోళనలతో సర్వసభ్య సమావేశాల్లో వారి గోడు వెలిబుచ్చుకున్నారు.

మొక్కలు నాటిన మహిళలు



కీసర: తల్లుల గౌరవార్థం మొక్కలు నాటే కార్యక్రమాన్ని మహిళా మోర్చా ప్రతినిధులు శుక్రవారం నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'ఏక్ పేడ్ మాకే నామ్' కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటినట్లు రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి చెప్పారు. బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ లావణ్య ఆధ్వర్యంలో..



మేడ్చల్: తల్లి జ్ఞాపకార్థం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ప్రధాని మోదీ పిలుపు మేరకు పట్టణ పరిధిలోని గిర్మాపూర్‌లో శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి కౌన్సిలర్ వంగేటి లావణ్య హన్మంత్‌రెడ్డి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ఆంజనేయులు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాఘవరెడ్డి, నాయకులు మల్లారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, వంశీరెడ్డి, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గుర్తింపు లేని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో విజయ కుమారి సహా ఎంఈఓలు వసంత కుమారి, శశిధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ.. గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని అనేకసార్లు ఫిర్యాదు చేసినా విద్యాధికారులు చర్యలు తీసుకోవటం లేదని ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో బుక్స్, యూనిఫాం, బెల్టులు విక్రయిస్తూ..రూ. లక్షలు దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సెల్‌ఫోన్ చోరీ

ఘట్‌కేసర్: ఇంట్లో సెల్ ఫోన్ చోరీ అయిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌లోని బ్రూక్ బాండ్ కాలనీలో ఉంటున్న రీనా దేవి (31) గురువారం రాత్రి 10 గంటలకు నిద్రపోయారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు లేచి చూడగా.. సెల్ ఫోన్ కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చోరీ చేశారని ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మేడ్చల్: శామీర్‌పేట్ మండలం లాల్‌గడీ మలక్‌పేట్‌లోని 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు వల్ల ఈ నెల 10వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మేడ్చల్ డివిజన్ డీఈ పి.శ్రీనాథ్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి 80 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ అమరుస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయం వద్ద అన్నదానం

మేడ్చల్: పట్టణంలోని ఏడు గుళ్ల వద్ద శ్రీపాద వల్లభ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రస్ట్ వారు స్టాల్స్ ఏర్పాటు చేసి అన్న వితరణ చేశారు. ప్రత్యేక రోజులలో పేదలకు అన్నదానం చేస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు రమేష్‌గుప్తా తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, దాతలు పాల్గొన్నారు.

మేడ్చల్ వాసికి ప్రపంచ పర్యావరణ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న డాక్టర్ శ్రేయారెడ్డి

మేడ్చల్: బిహార్‌లోని పాట్నా ఎయిమ్స్‌లో పీజీ చదువుతున్న మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి కుమార్తె డాక్టర్ శ్రేయారెడ్డికి ప్రపంచ పర్యావరణ పురస్కారం లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నెల రోజుల పాటు శ్రేయారెడ్డి వివిధ అంశాలపై అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇవ్వడంతో ఆమెకు పాట్నా ఎయిమ్స్ పురస్కారం అందజేసింది. యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ నీలోత్సవ్ బల్ పురస్కారం అందజేశారు.

గంజాయిని అరికట్టాలని వినతి


సీఐకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మేడ్చల్: మేడ్చల్‌లో గంజాయి లేకుండా చేయాలని బీజేపీ పట్టణ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు సీఐ సత్యనారాయణను కోరారు. ఈ మేరకు శుక్రవారం స్టేషన్‌లో సీఐకి వినతిపత్రం అందజేశారు. అనేక మంది యువత, విద్యార్థులు గంజాయికి బానిసవుతున్నారని, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, ప్రేందాస్, ఈశ్వర్, ఇతర నాయకులు రఘురాంపటేల్, మహేశ్, వంశీ, విజయ్, శ్రీశైలం యాదవ్, నరేందర్ పాల్గొన్నారు.

కడుపు నొప్పితో డ్రైవర్ మృతి

జవహర్‌నగర్: కడుపునొప్పితో లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... శ్రీకాకుళం ఇచ్ఛాపురానికి చెందిన ఢిల్లీరావు (38) లారీ డ్రైవర్. నేపాల్ నుంచి చీపురుకట్టల లోడ్‌తో విజయవాడకు వచ్చాడు. అక్కడి నుండి లారీని నడుపుకుంటూ జవహర్‌నగర్ కూరగాయల మార్కెట్ సమీపంలోని ఒక మైదానంకు చేరుకున్నాడు. కడుపునొప్పి రావడంతో మెడిసన్ వేసుకొని ఈనో తాగిన తగ్గలేదు. కార్మికులు చీపురు కట్టల లోడ్‌ను దించిన అనంతరం పడుకున్న లారీ డ్రైవర్‌ని లేపుదామని క్లీనర్ వెళ్లగా.. నోట్లో నుంచి నురగలు కక్కి మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387